

రేపు గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు

బూర్జ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విద్యాలయాల సంస్థ సమన్వయకర్త ఎన్.బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గానూ బూర్జ మండలంలోని కొల్లివలస గురుకులం (బాలురు)లో ఖాళీగా ఉన్న జెఎల్ మ్యాథ్స్‌కు, కంచిలి గురుకులంలో జెఎల్ కెమిస్ట్రీకి పురుష అభ్యర్థులు, పాతపట్నం బాలికల గురుకులంలో టిజిటి బయోలాజికల్ సైన్స్, పిజిటి సోషల్ స్టడీస్ పోస్టులకు మహిళా అభ్యర్థులు, ఎచ్చెర్లలోని గురుకులంలో జెఎల్ జువాలజీకి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూ, డెమో ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. బయోడేటాతో పాటు పిజి, బిఇడి ఒరిజినల్ ధ్రువపత్రాలతో శ్రీకాకుళంలోని గురుకుల విద్యాలయ సంస్థ కార్యాలయంలో ఈనెల 18న ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

పాలన మారింది... పనితీరు మార్చుకోండి

సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో పాలన మారిందని, అందుకనుగుణంగా సిబ్బంది పనితీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులకు సూచించారు. పాలన మారిన విషయం స్పష్టమయ్యేలా ఫలితాలు తీసుకురావాలన్నారు. కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని సూచించారు. స్థానిక బాపూజీ కళామందిరంలో నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయాల ఇన్‌ఛార్జీలు, టిడిపి నాయకులతో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నగరం కార్పొరేషన్‌గా రూపాంతరం చెందినా, ఆ స్థాయి అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాలకు దూరంగా ఉందన్నారు. నగర పంచాయతీని తలపిస్తున్న శ్రీకాకుళం నగరాన్ని కార్పొరేషన్ స్థాయికి తగ్గట్లు రూపొందించేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్పొరేషన్‌లో సిబ్బంది కూడా మున్సిపాలిటీ స్థాయిలోనే ఉన్నారని, సరిపడా సిబ్బందిని నియమించేందుకు కృషి చేస్తానని తెలిపారు. టిడిపి నాయకులు, వార్డు ఇన్‌ఛార్జీలకు తగిన గౌరవం ఇవ్వాలని సూచించారు. సచివాలయ పరిధిలోని సమస్యలు అక్కడే పరిష్కారమయ్యేలా అడ్మిన్‌లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. 48 సచివాలయాలను నాలుగు జోన్‌లుగా ఏర్పాటు చేసి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తామన్నారు.

విలీన పంచాయతీల పరిధిలో సచివాలయాలకు సైతం కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. డివిజన్ ఇన్‌ఛార్జీల ప్రతిపాదనల మేరకు అంచనాలు రూపొందించి ఇస్తే నిధులు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. త్వరలోనే కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించే అవకాశమున్నందున నగరంలోని ప్రధాన సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో కార్పొరేషన్ పరిధిలోని ఇంజినీరింగ్, వాటర్ సప్లై, విద్యుత్, ప్రజారోగ్యశాఖ, పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పిజి సెట్‌లో మెరిసిన విద్యార్థినులు

శ్రీకాకుళం అర్బన్ : ఇటీవల వెలువడిన ఎపి పిజి సెట్ ఫలితాల్లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు వృక్షశాస్త్రంలో సత్తా చాటారు. కళాశాలలో బిఎస్‌సి పూర్తి చేసిన డి.మాధురి, పి.పూజిత 23వ ర్యాంకు, జె.దేవయాని 29వ ర్యాంకు సాధించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ ఆధ్వర్యాన కళాశాలలో విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, ఐక్యూఎసి కోఆర్డినేటర్ పద్మావతి, సిఒఒ ఆదిలక్ష్మి, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఎస్.రుద్రంరాణి, సిహెచ్.సునీత, ఎ.వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ఆనవాలు కోల్పోతున్న ఆనకట్ట

- పాడైపోయిన షట్టర్లు, మదుములు
- ఆధునీకరణకు 2022లో రూ.12.05 కోట్లతో ప్రతిపాదనలు
- నేటికీ ఆమోదం పొందని వైనం
- రైతులకు తప్పని సాగునీటి ఇబ్బందులు

చిన్న నీటిపారుదల వ్యవస్థలపై ప్రభుత్వం ఉదాసీనత కనబరుస్తోంది. వేలాది ఎకరాలకు సాగునీరందించే ఆనకట్టలను పట్టించుకోకపోవడంతో రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. మరమ్మతులు, ఆధునీకరణ పనుల వైపు పాలకులు దృష్టిసారించకపోవడంతో సాగునీటి వనరులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఉమ్మడి జిల్లా పాలకొండలోని వెలగవాడ పంచాయతీ విజయరామపురం వద్ద నిర్మించిన ఓనిగెడ్డ ఆనకట్ట ద్వారా నిర్దేశించిన ఆయకట్టు మేరకు నీరందని పరిస్థితి నెలకొంది. కాలువలు, షట్టర్లు అధ్వానంగా ఉండడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ఆధునీకరణ పనులకు అధికారులు పలుమార్లు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపకపోవడంతో, పనులకు మోక్షం లభించడం లేదు.


ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

జిల్లాలో ఓనిగెడ్డ ప్రధాన సాగునీటి వనరుగా ఉంది. దశాబ్దలుగా రైతులకు వరప్రదాయనిగా నిలిచింది. పాలకొండ మండలం వెలగవాడ పంచాయతీ పరిధిలోని విజయరామపురం వద్ద ఓనిగడ్డ ఉంది. కొండల నుంచి జాలువారిన నీటిని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో 1957లో అప్పటి ప్రభుత్వం అక్కడ ఆనకట్టను నిర్మించింది. పాలకొండ, బూర్జ మండలాల పరిధిలో 7,048 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. కాలువ పొడవవు మొత్తం 21.60 కిలోమీటర్ల మేర ఉంది. ఆనకట్ట వాస్తవ సామర్థ్యం 3.875 మిలియన్ క్యూబిక్ అడుగులుగా ఉంది. కాలువలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ తొలగింపు చేపట్టకపోవడంతో ఏటికేడు ఆనకట్టు సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది. కాలువపై పలుచోట్ల ఏర్పాటు చేసిన షట్టర్లు శిథిలావస్థకు చేరాయి. చాలాచోట్ల మదుములు పూర్తిగా పాడైపోయాయి. దీంతో సాగునీరు సక్రమంగా అందక పంటలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది.

అటకెక్కిన ఆధునీకరణ పనులు

ఓనిగెడ్డ ఆనకట్ట, కాలువలు, షట్టర్ల పరిస్థితిని గతేడాది జూలై ఒకటో తేదీన శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్లు ఇరువురూ పరిశీలించారు. వీరితోపాటు అప్పటి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఎమ్మెల్యే వి.కళావతి కూడా ఉన్నారు. ఆధునీకరణ పనులకు అంచనాలు తయారు చేయాలని కలెక్టర్ల సూచనలతో జలవనరులశాఖ అధికారులు రూ.12.05 కోట్లతో డిసెంబర్ 6, 2022లో ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత చిన్న, మధ్య తరహా నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజినీర్ ఇవే ప్రతిపాదనలను గతేడాది మార్చి రెండో తేదీన జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపారు. అప్పటి వైసిపి ప్రభుత్వం వీటికి ఆమోదం తెలపకపోవడంతో, ఆధునీకరణ పనులను ప్రారంభించే అవకాశం లేకుండా పోయింది. కొత్త ప్రభుత్వమైనా ప్రతిపాదనలకు క్లియరెన్స్ ఇస్తే రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విజయరామపురంలో ఓనిగెడ్డ ఆనకట్ట దుస్థితి





పాడైన షట్టర్లు

ఆనకట్ట ఉన్నా ప్రయోజనం లేదు



ఓనిగెడ్డ ఆనకట్ట ఉన్నా ఏం ప్రయోజనం కనిపించడం లేదు. కాలువలు పాడైపోవడం, పిచ్చిమొక్కలు పాడైపోవడంతో నీరు రావడం లేదు. వర్షాలు పడక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చినప్పుడు మా పొలానికి సమీపంలో ఉన్న నేలబావి నీటితో పొలాలను తడుపుతున్నాం.

- ఎస్.దాలినాయుడు, డొంకలపర్త

ఇంజిన్‌తో పొలాలను తడుపుతున్నాం



ప్రతి ఎకరాకు నీరందిస్తామని ప్రజాప్రతినిధులు మాటలు చెప్తున్నారు. పొలాలకు మాత్రం నీరు రావడం లేదు. ఓనిగెడ్డ ఆనకట్ట చాలాకాలంగా పాడైపోయినా పట్టించుకోవడం లేదు. మా పొలానికి సమీపంలో ఉన్న పెద్ద చెరువు నుంచి ఇంజిన్ల సాయంతో నీరు పెడుతున్నాం.

- ఎం.పాపారావు, లక్కుపురం

ప్రభుత్వం ఆమోదిస్తే పనులు చేపడతాం



ఓనిగెడ్డ ఆనకట్ట, షట్టర్లు, కాలవలు పూర్తిగా పాడైపోయాయి. ఆధునీకరణ పనులు చేయాల్సి ఉందంటూ రూ.12.05 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం ఆమోదిస్తే పనులు చేపడతాం.

- పి.సుధాకరరావు, జలవనరులశాఖ ఎస్ఇ

ఉగ్రవాదుల కాల్పుల్లో మరో జవాను మృతి



రాజేష్ (ఫైల్)

ప్రజాశక్తి - నౌపడ

జమ్మూ కాశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఉగ్రవాదుల కాల్పుల్లో జిల్లాకు చెందిన మరో జవాను అమరుడయ్యాడు. సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర పంచాయతీకి చెందిన డొక్కరి రాజేష్ (25) వీర మరణం పొందాడు. దోడా ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు భారత ఆర్మీ, జమ్మూ కాశ్మీర్ పోలీసులు సోమవారం సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. ఉగ్రవాదులు కాల్పులకు దిగడంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. ఈ ఘటనలో ఉగ్రవాదుల కాల్పుల్లో నందిగాం మండలం వల్లభరాయుడుపేటకు చెందిన సనపల జగదీశ్వరరావు మృతి చెందిన విషయం తెలిసిందే. అదే ఘటనలో రాజేష్ కూడా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సోమవారం రాత్రి సమాచారం అందింది. మృతుడు రాజేష్‌కు తల్లిదండ్రులు పార్వతి, చిట్టివాడు, తమ్ముడు మధుసూదనరావు ఉన్నారు. గ్రామంలో అందరితో కలసిమెలసి ఉండే రాజేష్ మృతితో కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాజేష్ మృతి చెందిన విషయం తెలిసిన తర్వాత గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మంత్రి సంతాపం

దేశ రక్షణ కోసం పోరాడి ఉగ్రవాదుల కాల్పుల్లో రాజేష్ అశువులు బాయడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెక్కలి నియోజకవర్గంలో నందిగాం మండలానికి చెందిన సనపల జగదీశ్వరరావు, సంతబొమ్మాళి మండలానికి చెందిన రాజేష్ మృతి ఎంతో బాధ కలిగించిందని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

19న జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని డిఎల్‌టిసిలో ఈనెల 19వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధికల్పన అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. సంగీతా మొబైల్స్, అమెజాన్ సంస్థల్లో ఉద్యోగ నియామకాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఆపై తరగతులు చదువుకున్న నిరుద్యోగ యువకులు జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు. సంగీత మొబైల్స్‌కు ఎంపికైన వారు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. అమెజాన్‌కు ఎంపికైన వారు హైదరాబాద్, చెన్నైలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని సూచించారు.

ఆక్రమణలపై ఏం చేస్తున్నారు?

రెవెన్యూ అధికారులపై ఎమ్మెల్యే ఎంజిఆర్ ఆగ్రహం



అధికారులను అడిగి వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి - పాతపట్నం

పాతపట్నం పట్టణ నడిబొడ్డులోనే ఎర్ర చెరువును ఆక్రమించుకుని ఇళ్లు కడుతుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని అంతరాబ కూడలి సమీపంలోని ఎర్ర చెరువులో కొంతమంది స్థానికులు ఆక్రమించుకుని ఇళ్లు కడుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆక్రమణలను మంగళవారం పరిశీలించారు. చెరువు విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను తహశీల్దార్ వై.వి.ఎస్ ప్రసాద్, సర్వేయరు రామ గణపతి, విఆర్ఒ పార్థసారథిని అడిగి తెలుసుకున్నారు. చెరువుకు సంబంధించిన భూమిలో పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తున్నారని, వాటికి అనుమతులు ఎలా మంజూరయ్యాయని ప్రశ్నించారు. చెరువుకు సంబంధించిన సర్వే రికార్డులను పరిశీలించి రెండు రోజుల్లో పూర్తి నివేదికను ఇవ్వాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. సర్వే అనంతరం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా, ఆక్రమణలు ఉన్నట్లు నిరూపణ అయినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, పర్యావరణ వనరులను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జీ, తెలుగు యువత పట్టణాధ్యక్షులు ఎస్.సతీష్, స్థానిక సర్పంచ్ ప్రతినిధి ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి జనసేన సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న జనసేన జిల్లా అధక్షులు చంద్రమోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ తెలిపారు. నగరంలోని తన నివాసంలోని మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమాజంలో మంచి మార్పు తీసుకురావడం కోసం జనసేన పార్టీతో కలిసి అడుగులు వేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల భద్రత పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ బాధ్యత అని అన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ద్వారా పలు ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.ఐదు లక్షలు చొప్పున మూడేళ్లుగా సహాయం అందిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా చేపడుతున్న పార్టీ సభ్యత్వ నమోదు కావడంతో విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా సభ్యత్వం తీసుకునే ప్రతిఒక్కరికీ రూ.ఐదు లక్షల ప్రమాద జీవిత బీమాతో పాటు రూ.50 వేల ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. గతంలో తీసుకున్న సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాలన్నారు. జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు మాట్లాడుతూ మండలాలు, పంచాయతీలు, వార్డులు, డివిజన్ స్థాయిలో సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టాలన్నారు.



ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న రవికుమార్

భూ ఆక్రమణలపై సమగ్ర నివేదిక

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని గాజులకొల్లివలస సమీపంలో వంశధార నిర్వాసితులకు ఏర్పాటు చేసిన ఆర్ ఆర్ కాలనీలో భూ ఆక్రమణలపై సమగ్ర నివేదిక అందించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్ ఆర్ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి నాయకుడు గొర్రె రామశంకర్ కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. అనంతరం కాలనీలో ప్రజా దర్బార్ నిర్వహించారు. వంశధార నిర్వాసిత గ్రామాలైన తులగాం, పాడలి, దుగ్గుపురం, బర్రిపేట, చిన్న కొల్లివలస గ్రామాలకు చెందిన సుమారు 530 కుటుంబాలకు అప్పటి టిడిపి ప్రభుత్వం మూడు బ్లాకులుగా విభజించి ఒక్కొక్కరికి ఐదు సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలను మంజూరు చేసిందని స్థానికులు గుర్తుచేశారు. కొంత స్థలం రిజర్వులో ఉంచిందని, ఆ స్థలాలను గత ప్రభుత్వంలోని పెద్దలు కొంతమందికి కట్టబెట్టారని ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. బ్లాక్-2 లోని కమ్యూనిటీ హాల్ స్థలంలో మండలంలోని కొర్లకోటకు చెందిన ఓ వ్యక్తి పేరిట పట్టాను మంజూరు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులకు అనధికార పట్టాలు మంజూరు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిపై సమగ్ర సర్వే చేసి నివేదిక అందజేయాలని సర్వేయరు బొడ్డేపల్లి గోపిని ఆదేశించారు. కాలనీలో బ్లాక్‌ల వారీగా ప్లాట్ల చిత్రపటాలను తయారు చేయించి ఐరన్ బోర్డులపై అందరికీ అర్థమయ్యేలా పూర్తి సమాచారంతో ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్‌ఆర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాల కమ్యూనిటీ భవనం, ఆలయాలు, పలు మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించినా అసంపూర్తిగా ఉన్నాయని నిర్వాసితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి హామీ పనులు కల్పించడం లేదని చెప్పారు.

పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్, ఆశా కార్యకర్త, విఆర్ఎ పోస్టులు మంజూరు చేయలేదని చెప్పారు. దీనిపై స్పందించిన రవికుమార్ ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే ఆర్ అండ్ ఆర్ కాలనీకి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీనిచ్చారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన 16 ఇళ్లకు ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని రవికుమార్ దృష్టికి బాధితులు తీసుకురాగా, గృహనిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు, నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, గొండు రమణమూర్తి, ఎంపిటిసి బండి ప్రభావతి, సర్పంచ్ సొండి దమయంతి, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

బెదిరింపు కాల్స్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం తనకు, టెక్కలి నియోజకవర్గంలోని వైసిపి కార్యకర్తలకు చంపేస్తామంటూ బెదిరింపు ఫోన్ కాల్స్ చేస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, సిఐ పైడయ్యకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బెదిరింపు కాల్స్ చేస్తున్న గుర్తుతెలియని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై శాసనమండలి చైర్మన్, డిజిపి, ఎస్‌పికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో వైసిపి మండల అధ్యక్షులు అజయ్ కుమార్, పట్టణాధ్యక్షులు టి.కిరణ్, పినకాన వైకుంఠరావు తదితరులున్నారు.

రాయితీపై బియ్యం, కందిపప్పు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై కందిపప్పు, బియ్యం అందిస్తోందని డిఎస్ఒ శాంతిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ కందిప్పు రూ.190 పైబడి విక్రయిస్తుండగా, రైతుబజార్లలో రాయితీపై రూ.160కి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుబజారుతో పాటు బహిరంగ మార్కెట్‌లోనూ స్టీమ్డ్ బిపిటి సోనామసూరి కేజీ రూ.49, పచ్చి బిపిటి సోనామసూరి కేజీ రూ.48కు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లోనూ ఇవే ధరలతో బియ్యం, కందిపప్పును విక్రయించాలని వ్యాపారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయిస్తే ఆ మండల పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

మత్స్యకారులను విడిపించేందుకు చర్యలు

శ్రీకాకుళం అర్బన్ : శ్రీలంకలో చిక్కుకున్న జిల్లాకు చెందిన మత్స్యకారులను సురక్షితంగా స్వగ్రామానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దగనగళ్లవానిపేటకు చెందిన మత్స్యకారులు దాసరి వెంకయ్య, గనగళ్ళ కొర్లయ్యలు కర్నాటక రాష్ట్రం నాగాయపట్నంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లి గత నెల 25న శ్రీలంక కోస్ట్‌గార్డులకు చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. మత్స్యకారులను విడిపించేందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సహకారాన్ని కోరనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలు అధైర్యపడొద్దని, బాధిత మత్స్యకారులను క్షేమంగా తీసుకొస్తామని భరోసానిచ్చారు. వారి కుటుంబాలకు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొండు జగపతి, ఎంపిటిసి మూకళ్ల శ్రీను, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



రాంగ్ పార్కింగ్ చేస్తే చర్యలు

శ్రీకాకుళం అర్బన్: నగరంలో వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నందున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనదారులు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. రోడ్లపై ఎక్కడికక్కడ వాహనాలు నిలపడం, రాంగ్ పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. నిబంధనలకు అతిక్రమిస్తే వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి ఆర్ట్స్ కాలేజ్ రోడ్డులో తోపుడుబళ్లు , ఇతర ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసే వారు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఉండాలని స్పష్టం చేశారు. ఫుట్‌పాత్ దాటి వస్తే చర్యలు తప్పవన్నారు.


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ బాలకోటేశ్వరరావు

పారిశుధ్య మెరుగుకు చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- బూర్జ

గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టాలని డిఎల్‌పిఒ బాలకోటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొల్లివలసలో పరిసరాలను మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ఎక్కడా మురుగునీరు లేకుండా చూడాలని, చెత్తకు తొలగించాలని ఆదేశించారు. పంచాయతీ సిబ్బంది రోజూ గ్రామాలను సందర్శించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, కార్యదర్శి రాజారావు పాల్గొన్నారు.

మండలంలోని కొల్లివలసలో ఎస్‌సి వీధి మెయిన్ రోడ్డులో మురుగునీరు రహదారిపైనే ప్రవహిస్తుందేది. రోడ్డు పక్కనే చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్గంధభరింతగా ఉండేది. దీనిపై మంగళవారం 'ప్రజాశక్తిలో 'జ్వరాలతో వరుకుతున్న గ్రామాలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి కొల్లివలస పంచాయతీ కార్యదర్శి రాజారావు స్పందించి ప్రొక్లెయినర్‌తో చెత్త కుప్పలను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ జల్లించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

విచారణకు సహకరించని సతీష్‌బాబు

కవిటి : ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పదుల సంఖ్యలో బాధితుల వద్ద రూ.లక్షల్లో వసూలు చేసి మోసం చేసిన మందస మండలం లోహరిబంద పంచాయతీ కార్యదర్శి మన్నం సతీష్‌బాబు విచారణకు సహకరించడం లేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు మందస ఎంపిడిఒ ఎ.రఘుపతిరావు మంగళవారం సతీష్‌బాబును విచారించేందుకు సిద్ధమయ్యారు. కానీ, సతీష్‌బాబు విచారణకు హాజరు కాకుండా ఏవేవో సాకులు చెబుతూ తప్పించుకు తిరుగుతున్నట్టు ఎంపిడిఒ తెలిపారు. మరోవైపు కవిటి మండలానికి చెందిన పలువురు బాధితులు సతీష్‌బాబు తమనూ మోసం చేశాడని జిల్లా పంచాయతీ అధికారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇందులో సతీష్‌బాబు భార్య బేతపూడి సుజాత (ప్రభుత్వ ఉపాధ్యాయని) ప్రమేయం కూడా ఉందని, ఆ డబ్బులు తాను ఇస్తానని చెప్పి తన భర్తను కేసు లేకుండా విడిపించుకుని వెళ్లినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై తగు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

జిఒ విడుదల చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

కొత్తూరు: ఆశా వర్కర్స్‌తో గత ప్రభుత్వం ఫిబ్రవరి 9న చేపట్టిన చర్చల ఒప్పంద జిఒలు, సర్క్యులర్‌ను వెంటనే విడుదల చేయా లని సిఐటియు నాయకు లు సిర్ల ప్రసాద్, ఎపి ఆశా వర్కర్ల యూనియన్ నియోజకవర్గ నాయకులు పి.జయలక్ష్మి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.గౌరమ్మ, కె.జ్యోత్స్న, ఎస్.పావని, లక్ష్మి, పూర్ణ, జగదాంబ, అనిత, రోజా, పద్మ, శ్రీలత, స్వర్ణ పాల్గొన్నారు.

ఉబాలు విడిచి వెదలు జల్లి...

పలాస డివిజన్ పరిధిలో 16,368 ఎకరాల్లో సాగు

ప్రజాశక్తి- పలాస



వ్యవసాయం రోజు రోజుకూ ఖరీదైపోతోంది. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతన్నలు కుదేలు అవుతున్నారు. పంటలకు పెట్టిన పెట్టుబడుల కన్నా వ్యవసాయంపై వచ్చిన ఆదాయం రోజురోజుకూ తగ్గిపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేస్తుంటే నడి సమయానికి ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి రాపురిస్తోంది. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు అనుకున్నస్థాయిలో ప్రభుత్వ ప్రోత్సాహం కరువవ్వడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీంతో రైతులు తమ దిశను మార్చుకొని పెట్టుబడి తగ్గించుకొని ఉబాలు విడిచి పెట్టి ఎదలు వైపు మొగ్గు చూపుతున్నారు.

పలాస డివిజన్ పరిధిలోని మందస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పలాస మండలాల్లో గతేడాది కన్నా ఈ ఏడాది ఉబాలు శాతం ఘననీయంగా తగ్గిపోతుంది. పలాస వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో 49,521 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 16,368 ఎకరాల్లో వెదలు వేయగా ఉబాలు కోసం 617 ఎకరాల్లో విత్తనాలు వేశారు. ఏటా ఉబాలు వేసేందుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతారు. గత నాలుగేళ్లుగా వర్షాభావ పరిస్థితులు వల్ల రైతులు దిశ మార్చుకుని ఎక్కువ శాతం వెదలు వేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటి వరకు నారు కోసం విత్తనాలు చల్లితే 16,368 ఎకరాల్లో వెదలు వేసినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి.

పెరిగిన పెట్టుబడులు

ఖరీఫ్‌లో ఉబాలు వేయాలంటే పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయింది. ఎకరాకు ప్రారంభం దేశలోనే దుక్కిపెట్టి నారు పెట్టేందుకు ఎకరాకు రూ.3,300లు, గట్లు వేసేందుకు రూ.1500లు, నారు తీసి ఉబాలు వేసేందుకు రూ.6 వేలు, నారు సర్ధడానికి రూ.వెయ్యి ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఏడాది పొడవునా ఎకరా పంటకు సుమారు రూ.25 వేలు ఖర్చు అవుతుండగా, వెదలు వేస్తే దుక్కు, గట్లు, రెండు పర్యాయాలు గాబు, పంటకు ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి పిచికారీ చేసేందుకు ఎకరాకు సుమారు రూ.15 వేలు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. అయితే ఉబాలు కన్నా వెదలు వేస్తే పంట దిగుబడి తగ్గుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో వెదలు వేయడం మంచిదని రైతులు భావిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే రైతు గుండెల్లో దడ మొదలవుతుంది. ప్రతి చిన్న పనికీ కూలీలు అవసరం. కానీ, వ్యవసాయ పనులు చేసేందుకు కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. కూలీలకు అధిక కూలీ ఇస్తామని చెప్పిన ముందుకు రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీడిపప్పు, జీడి పిక్కల పనులు, సిమెంట్ పనులు ఇతర కూలి పనులకు వెళ్లిపోవడంతో వ్యవసాయ పనులకు కూలీలు కొరత తీవ్రంగా ఉందని రైతులు చెబుతున్నారు. దీంతో ఉబాలు కన్నా వెదలు వేయడం ద్వారా పెట్టుబడులు తగ్గడంతోపాటు అంతగా కూలీలతో పని ఉండదని రైతులు చెబుతున్నారు. గతంలో వ్యవసాయ పనిచేసేందుకు కూలీలు పరుగులు తీసే వారిని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో వ్యవసాయం చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్లే వెదలు వేసేందుకు రైతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

కూలీల కొరత ఉంది



ఖరీఫ్ సీజన్లో కూలీల కొరత తీవ్రంగా ఉంది. కూలీ పనులు చేసేందుకు పిలిచిన కూలీలు రావడం లేదు. డబ్బులు అదనంగా ఇస్తామని చెప్పిన వ్యవసాయ పనులు చేసేందుకు ఇష్టపడడం లేదు. చివరకు ఉబాలు కన్నా ఎదలు వేసుకోవడం మంచిందని రైతులు భావిస్తున్నారు.

\- నిమ్మాడ బాబూరావు, రైతు, కిష్టుపురం

వెదల వల్ల పెట్టుబడి తక్కువ



ఉబాలు కన్నా ఎదలు వేసుకోవడం వల్ల పెట్టుబడి తక్కువ ఉంది. వ్యవసాయం చేసేందుకు ఇబ్బంది ఉండదు. సకాలంలో సాగునీరు అందక పోవడం, పెట్టుబడులు ఎక్కువగా ఉండడంతోనే ఎదలు వేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు.

\- బొడ్డేపల్లి ప్రసాదరావు, రైతు, గోపాలపురం

ముందు దిగుబడి వస్తుంది



ఈ ఏడాది రైతులు వెదలు వేసేందుకు మొగ్గు చూపారు. వెదలు వేసుకోవడం ద్వారా 15 రోజులు ముందు పంట దిగుబడి వస్తుంది. ఉబాలు కన్నా వెదలకు పెట్టుబడి తక్కువ. సాగునీరు తక్కువ అవసరం అవుతుంది.

\- మధుసూదనరావు, వ్యవసాయశాఖ ఎడిఎ, పలాస

పోలీస్ పహారాలో ఇసుక ర్యాంపు

ప్రజాశక్తి- ఆమదాలవలస


నదిలోని ఇసుకను పరిశీలిస్తున్న తహశీల్దార్ రమేష్‌బాబు

మండలంలోని పెద్దసవలాపురం గ్రామ సమీపంలో ఉన్న వంశధార ఇసుక ర్యాంపులో మంగళవారం పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. పెద్ద సవలాపురంలో అక్రమంగా ఇసుక ర్యాంపు నిర్వహించి యంత్రాలు, ట్రాక్టర్లతో అనధికార రవాణా చేస్తున్నారని కొంతమంది ప్రచారం చేశారు. ఈ ప్రచారం జిల్లా కేంద్రానికి సమాచారం అందడంతో గ్రామంలో టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య మనస్పర్ధలు ఏర్పడి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందన్న ముందస్తుగా గుర్తించారు. దీంతో జిల్లా పోలీస్ యంత్రాంగం పోలీసులను అప్రమత్తం చేశారు. దీనితో మంగళవారం తెల్లవారుజామున ఆమదాలవలస, బూర్జ ఎస్ఐలు వెంకటేష్, ప్రసాద్ తమ సిబ్బంది, సరుబుజ్జిలి పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. వైసిపి నాయకుడు బద్రి రామారావుతో ఎస్ఐ ప్రసాద్ మాట్లాడి ఇసుక ర్యాంపు నిర్వహించకుండా పోలీస్ పహారా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. గ్రామంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా పోలీసులకు సహకరించాలన్నారు. అనంతరం వంశధార నది పరివాహక ప్రాంతంలోని ఇసుక ర్యాంపు వద్ద అక్రమ ఇసుక రవాణా జరక్కుండా పోలీసులతో గస్తీ ఏర్పాటు చేశారు. అలాగే తహశీల్దార్ జె.రమేష్‌బాబు ఇసుక ర్యాంపును పరిశీలించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కవిటి: ప్రజా సంక్షేమమే ధ్యేంగా పనిచేస్తానని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని వి.జల్లుపుట్టుగ గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసేవే తనకు పరమావధని అన్నారు. బెంతు ఒరియాల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మణి చంద్రప్రకాష్, పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, పండి దేవేంద్రమూర్తి, బార్ల చినబాబు, బెందాళం తిరుమలరావు పాల్గొన్నారు.

శోకసంద్రంలో వల్లభరాయుడుపేట

ప్రజాశక్తి- నందిగాం


రోదిస్తున్న కుటుంబసభ్యులు

మండలంలోని వల్లభరావు ఇటీవల ఉగ్రదాడిలో మృతి చెందిన సనపల జగదీశ్వరరావు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. జగదీశ్వరరావు మృతదేహం బుధవారం ఐదు గంటలకు ప్రత్యేక విమానంలో రానుందని సమాచారం తెలియడంతో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు ప్రత్యేక విమానంలో జమ్మూ నుంచి ఢిల్లీకి ఢిల్లీ, అక్కడి నుంచి విశాఖపట్నానికి మంగళవారం రాత్రి చేరుకోనుంది.

వైసిపి నాయకుల పరామర్శ

మండలంలోని వల్లభరాయుడుపేటకు చెందిన జగదీశ్వరరావు కుటుంబ సభ్యులను వైసిపి నాయకులు పేరాడ తిలక్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈయన వెంట ఎంపిపి నడుపూరి శ్రీరామ్మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు తమిరి ఫాల్గుణరావు, జెసిఎస్ కన్వీనర్ జయరాం, సర్పంచ్ మల్ల సీతారాం, కవిటి, ఎర్రయ్య, చిన్ని, జోగారావు ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి- జి.సిగడాం


జి.సిగడాం : మొక్కను నాటుతున్న హెచ్‌ఎం అరుణకుమారి

మొక్కలను పెంచడం ప్రభుత్వ బాధ్యతగా చూడకుండా ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా చూసినప్పుడే భావితరాలకు మంచి కాలుష్య రహిత సమాజాన్ని అందిస్తామని అద్వానంపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి అన్నారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో మంగళవారం గ్రామస్తులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ ఫ్యాక్టరీల ద్వారా, మనుషుల ద్వారా వెలువడే కార్బన్డయాక్సైడ్‌లను చెట్లు పీల్చుకొని ఆక్సిజన్ మనకు అందిస్తాయని అన్నారు. అనంతరం విద్యార్థులు పర్యావరణాన్ని కాపాడుదాం... భావితరాన్ని రక్షిద్దామని నినాదాలు చేశారు. విద్యార్థులు ఒక్కో మొక్కని సంరక్షిస్తామని హెచ్‌ఎంకు మాట ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతమ్మ, కోరాడ రవి, వైకుంఠరావు, బమ్మిడి శివ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరోగ్యం మహాభాగ్యంపై అవగాహనా సదస్సు, పచ్చదనం పరిశుభ్రత సేవ అనే వాటిపై యువ పర్యాటక క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అరవింద్ విద్యార్థులకు ఆరోగ్యం గురించి రోజువారి డైట్, ఆరోగ్యానికి మెరుగైన వ్యాయామం ఆవశ్యకత గురించి వివరించారు. సెట్‌శ్రీ ద్వారా ప్రస్తుతం సమాజంలో మహిళలు క్రైమ్, అక్రమంగా వ్యక్తిగత వికాసంపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా టూరిజం అధికారి నారాయణరావు మొక్కలు నాటడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మొదలవలస కృష్ణవేణి, సెట్‌శ్రీ మేనేజర్ ఎల్.ఎల్.నాయుడు పాల్గొన్నారు.

విత్తన బంతుల తయారీపై శిక్షణ


విత్తన బంతులను తయారు చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాముఖ్యతలపై విద్యార్థి దశ నుంచే పిల్లలకు తెలియాలనే ఉద్దేశంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీడ్ బాల్స్ తయారీపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు జిల్లా ఎఒఎల్ ప్రతినిధి డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు తెలిపారు. మంగళవారం బ్యాంకర్స్ కాలనీలోని విశాఖ స్కూల్‌లో ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీశ్రీ ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి దార్లపూడి రవి మొక్కల పెంచడానికి అవసరమైన సీడ్ బాల్స్‌ను తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు పాల్గొని, 800 విత్తన బంతులు తయారు చేశారు. వీటిని డ్రోన్స్ ద్వారా కానీ, ఇండియన్ నేవీ ద్వారా కానీ వర్షపాతం తక్కువగా ఉన్న మండలాలు, కొండ ప్రాంతాల్లో వెదజల్లే కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత డాక్టర్ కమ్మినేని మధుసూదనరావు, ప్రధానోపాధ్యాయుడు రామారావు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ డిడిసి సభ్యులు బెవర వెంకట రవిశంకర, ఉపాధ్యాయులు వారణాసి సందీప్, దేసూళ సురేంద్ర, వాలంటీర పి.శ్రీనివాస్, సిటిసి మెంబర్ అన్నపూర్ణ, అను పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం


మాట్లాడుతున్న ఎంపిపి దాసు

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నిమ్మన దాసు అధ్యక్షతన మంగళవారం నిర్వహించి మండల సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా వివిధ శాఖలపై చర్చ చేపట్టి మమ అనిపించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, వైస్ ఎంపిపి గుర్రెల శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, రౌతు విశ్వనాథం, వినోద్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు


మరమ్మతు పనులు చేయిస్తున్న సంజీవ్

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం యామలపేట పంచాయతీలో కొన్నాళ్లుగా విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని సర్పంచ్ ప్రతినిధి ముదిలి సంజీవ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో 16 కెవి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో పాత విద్యుత్ స్తంభాలు మార్చడం, కేబుల్ వైర్లు మరమ్మతు పనులను ప్రారంభించామని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఎప్పటినుంచో ఉన్న విద్యుత్ సమస్యపై వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లామని, అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరికిందన్నారు. కార్యక్రమంలో లోపింటి రామిరెడ్డి, రమేష్, సాహుగారి గోవిందరావు, దిలీప్‌కుమార్, సావుకారి తవుడు, ఎం.భాగ్యరాజు, వెంకటరమణ, లైన్‌మెన్ బ్రహ్మం, కాంట్రాక్టరు పాపారావు పాల్గొన్నారు.

సాగునీటితో రైతుల్లో ఆనందం


మంత్రికి అభినందనలు తెలుపుతున్న బాబూరావు

ప్రజాశక్తి- పలాస

వంశధార శివారు భూములకు నీరు విడిచిపెట్టడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని, ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ గౌతు శిరీష ఎన్నికల వాగ్దానంలో భాగంగా ప్రతి చేతికి పని-ప్రతి చేనుకు నీరు అనే నినాదాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఆ మేరకు గెలిచిన వెంటనే వంశధార నీరు శివారు భూముల వరకూ తీసుకువచ్చారని చెప్పారు. దీనికి మంత్రి కృషి ప్రశంసనీయమని అన్నారు. మంత్రిని కలుసుకున్న వారిలో టిడిపి నాయకులు సాసుమాన చంద్రమౌళి, యవ్వారి మోహనరావు, కొరికాన శంకర్, తమ్మినేని గంగాధర్, దేవుడు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న జర్నలిస్టులు

ఎస్‌పిని కలిసిన జర్నలిస్టులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా కె.వి.మహేశ్వర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జర్నలిస్టు సంఘాల నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం జర్నలిస్టు సంఘ డైరీని ఆయనకు అందజేశారు. ఎస్‌పిని కలిసిన వారిలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.జోగి నాయుడు, జాప్ జిల్లా అధ్యక్షుడు జి.షణ్ముఖరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల శంకరరావు, ఆప్త్రా అధ్యక్షులు గంజి ఎజ్రా, జర్నలిస్టు సంఘ నేతలు ఎం.ఎ.వి.సత్యనారాయణ, గొండ్యాల ప్రశాంత్, సంతోష్, రాము, శ్రీను, లవరాజ్ ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు : ఎమ్మెల్యే

రణస్థలం రూరల్ : అర్హులందరికీ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవాడికి ఆకలి తీర్చడం ఎంత ముఖ్యమో... తలదాచుకోవడానికి నీడా అంతకన్నా ముఖ్యమని అన్నారు. పేదలను దృష్టిలో పెట్టుకుని హౌసింగ్ పథకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయించిందని అన్నారు. కార్యక్రమంలో డిఇ కోపల అప్పారావు, నాలుగు మండలాల ఎఇలు మొదలవలస మోహనరావు, గొల్లంగి యువరాజ్, ఎం.రమేష్, రాజేంద్రప్రసాద్, కూటమి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, లెంక శ్యాం, ఎస్.నాగేశ్వరావు, గురాల రఘునాథ్, జీరు గురునాయుడు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

విద్యతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం

విద్యతోనే ఉన్నత లక్ష్యాలను అవరోధించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కొండములగాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు 20 మంది ఇటీవల ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ ఆధ్వర్యాన ఎమ్మెల్యేను విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి దానిద్వారా ఉన్నత శిఖరాల అవరోధించాలని కోరారు.

లావేటిపాలెంలో పూడికతీతలు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు పంచాయతీ లావేటిపాలెంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యాన మంగళవారం వీధుల్లో పూడికతీతలు ప్రారంభించారు. కొన్నాళ్లుగా పూడికతీతలు తీయకపోవడంతో కాలువల్లో దోమలు, ఈగలు, దుర్వాసనతో గ్రామస్తులు నివాసాలు వద్ద తీవ్రంగా ఇబ్బందులు పడ్డామని, పూడికలు తీసిన వెంటనే పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని దమ్మల వీధి పరిధిలోని రెల్లి వీధిలో అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం మిషన్‌శక్తి కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా నగర ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యాన సెక్టార్ సూపర్‌వైజర్ యోగీశ్వరమ్మ పాల్గొని బాల్య వివాహాలపై తల్లులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చట్టరీత్య నేరమని, నిబంధనలకు విరుద్ధంగా బాల్యవివాహాలు చేస్తే శిక్షర్హులు తెలిపారు. తల్లీబిడ్డలకు ఆధార్ కార్డు తప్పనిసరిగా చేయించుకొని ఆ నంబర్లను అంగన్వాడీ కేంద్రంలో ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు. జాయింట్ అకౌంట్ బ్యాంకు పొందడానికి వీలవుతుందని చెప్పారు. గృహహింస, వరకట్న వేధింపులు, అక్రమ రవాణా, ఏరియాలో ఎక్కడ ఉన్నా వెంటనే సంబంధిత టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, పార్వతి, సహాయకులు శారద, శశికళ పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న అంగన్వాడీలు


మధు బరోడా మృతదేహం

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో సుందరాడకు చెందిన మధు బరోడా (27) గడ్డి మందును సోమవారం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు హైదరాబాద్‌లో ఒక ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడే ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకునేందుకు నిశ్చయించుకున్నాడు. ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు చెప్పి 20 క్రితం హైదరాబాద్ నుంచి తన స్వగ్రామమైన సుందరాడ వచ్చాడు. ఇటీవల అన్న భార్య చనిపోయిందని, ఏడాది పాటు పెళ్లి చేసుకునేందుకు అవకాశం లేదని చెప్పారు. దీంతో తల్లిదండ్రులతో వాగ్విదానికి దిగాడు. తల్లిదండ్రులు స్పందించి అయితే హైదరాబాద్‌లో పెళ్లిచేసుకోవాలని చెప్పారు. దీంతో బరోడ మనస్తాపానికి గురయ్యాడు. బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి సమీపంలోని ఓ తోటలో గడ్డి మందు తాగేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న కుటుంబ సభ్యులు పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతి చెందారు. మధు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తండ్రి ప్రోపాలా ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధితో యువకుడు మృతి

ప్రజాశక్తి- సోంపేట


అనిల్ (ఫైల్)

మండలంలోని కొర్లాంకు చెందిన పందిరి అనిల్ (25) అనే యువకుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఆలయంలో చోరీ

పాతపట్నం : మండలంలోని కాగువాడలో ఉన్న లలితాంబ అమ్మవారి ఆలయంలో మంగళవారం దొంగతనం జరిగిందని ఎస్ఐ మహ్మద్ యాసిన్ తెలిపారు. అమ్మవారి మెడలో ఉన్న నల్లపూసలతో అమర్చిన బంగారు శతమానం, 3 కేజీల వెండి సామగ్రి చోరీకి గురైనట్లు వివరించారు. సమాచారం అందుకున్న శ్రీకాకుళం నుంచి క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డీలర్ మృతి

ప్రజాశక్తి- లావేరు


నారాయణ అప్పారావు (ఫైల్)

మండలంలోని గోవిందపురానికి చెందిన రేషన్ డిపో డీలర్ లంకలపల్లి నారాయణ అప్పారావు (74) మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈయన గ్రామంలో ఉత్తమ రేషన్ డీలర్‌గా పేరు పొందారు. 40 ఏళ్ల పాటు డీలర్‌గా పనిచేస్తూ... కార్డుదారులకు సక్రమంగా, సకాలంలో సరుకులు అందేంచేవారని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. డీలర్ మృతి విషయం తెలుసుకున్న టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ఇజ్జు వెంకటేశ్వరరావు, బాబూరావు, చిక్కాల ఎల్లన్నదొర, డీల సంఘం నాయకులు సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు.


ఆందోళన చేస్తున్న చీడివలస గ్రామస్తులు

ఎనిమిది మంది అరెస్టు

బూర్జ : మండలంలోని వివిధ గ్రామాల్లో పొలాల్లో రైతులకు సంబంధించిన సోలార్ ప్యానెళ్లను దొంగలించిన ఎనిమిది మంది వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి.వి.ప్రసాద్ తెలిపారు. 13 సోలార్ ప్యానల్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈ దొంగతనాలకు పాల్పడివారందరూ యువకులేనని తెలిపారు.

అసలైన నిందితులను అరెస్టు చేయాలి

మండలంలో జరుగుతున్న దొంగతనాలకు సంబంధించి అసలైన నిందితుడైన అరెస్టు చేయాలని చీడివలస గ్రామస్తులు కొల్లివలస కూడలి వద్ద ఆందోళనకు దిగారు. దొంగతనాల్లో హస్తమున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేయకపోవడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇందులో హస్తమున్న ఏ ఒక్కరినీ విడిచిపెట్టేది లేదని ఎస్ఐ స్పష్టం చేశారు.

హెల్మెట్ ధరించాలి

ఆమదాలవలస : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. కోర్టు ఆవరణలో హెల్మెట్ వాడకంపై అవగాహనా సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ తలకు లేకపోవడంతో ప్రమాదాలకు గురైనప్పుడు తలకు తీవ్ర గాయాలై మరణాలు సంభవిస్తున్నాయన్నారు. హెల్మెట్‌ను ధరించడం బరువుగా కాకుండా, బాధ్యతగా భావించాలని అన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎజిపి సీపాన గోవిందరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పైడి వరహానరసింహం, న్యాయవాదులు బొడ్డేపల్లి మోహనరావు, తమ్మినేని అన్నంనాయుడు, వాడవలస రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

పాతపట్నం : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ధునంజయ, భైరాగినాయుడు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

వసతిగృహాల నిర్వహణపై దృష్టి

ప్రజాశక్తి- పోలాకి

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వసతిగృహాల నిర్వహణపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ మేరకు వసతిగృహ వార్డెన్లతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతిగృహాల ప్రస్తుత పరిస్థితి, మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, అల్పాహారం, మెనూ, స్టడీ అవర్స్, ఆరోగ్య పరిస్థితి అంశాలపై దృష్టిసారించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఎటువంటి విమర్శలు, ఫిర్యాదు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వసతిగృహాలు సంక్షేమ అధికారి చాముండేశ్వరి మాట్లాడుతూ బిసి హాస్టల్లో 320 సీట్లు, ఎస్‌సి హాస్టల్లో 109 సీట్లు భర్తీ చేశామని తెలిపారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కలెక్టర్, ఎస్‌పిని కలిసిన దళిత నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లాలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండర్కర్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కె.వి.మహేశ్వర్‌రెడ్డిలను మంగళవారం జిల్లా దళిత సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సరుబుజ్జిలి మండలం మూలసవలాపురానికి చెందిన జిల్లా ఎస్‌సి, ఎస్‌టి సంఘం అధ్యక్షులు గొల్లపల్లి ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సురేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా అధికారులను తమ సంఘ కార్యవర్గ సభ్యులతో కలిసి సాదరస్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపామన్నారు. అలాగే జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరామని అన్నారు. కార్యక్రమంలో శశికుమార్, శ్రీధర్, వసంత, జగదీష్, మహేష్, తారకేష్, బుజ్జి పాల్గొన్నారు.

మధుబాబుకు డాక్టరేట్



డాక్టరేటును అందుకున్న మధుబాబు

శ్రీకాకుళం అర్బన్ : నగరానికి చెందిన న్యాయవాది పాలిశెట్టి మధుబాబుకు డాక్టరేట్ లభించింది. ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించి తమిళనాడుకు చెందిన డే స్ప్రింగ్ యూనివర్సిటీ, బిహెచ్‌ఆర్‌సి సంస్థ ఈ డాక్టరేటును ప్రకటించింది. ఊటీలో జరిగిన డాక్టరేట్స్ ప్రదానోత్సవంలో డాక్టరేట్‌ను సంస్థ ప్రతినిధులు మంగళవారం అందజేశారు. శ్రీకాకుళం గ్రీన్ సిటీని స్థాపించి ఫౌండర్‌గా పేద విద్యార్థులకు చదివించడం, అందులకు సాయమందిస్తున్న ఆయన జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్‌లో వివిధ పదవుల్లో కొనసాగారు. డాక్టరేట్‌ను, డాక్టర్ ఎమోస్ జెమ్స్, డాక్టర్ పూర్ణచంద్ర సాహూ, డాక్టర్ ఎస్.కె.పాత్ర, ఇంటర్నేషనల్ ఫిల్మెడిటర్ ఆర్.శంకర్ చేతుల మీదుగా అందుకున్నారు.

నాయకత్వ లక్షణాలు అలవడాలి

టెక్కలి : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవడాలని టెక్కలి ఎస్ఐ వెంకట్ రమణ అన్నారు. స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో మంగళవారం విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ, ప్రాముఖ్యత విషయాలపై అవగాహన ఉండాలన్నారు. రవీంద్ర భారతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.ఎస్.మణి మాట్లాడుతూ చిత్తశుద్ధి, అంకితభావం, నిబద్ధత వంటి లక్షణాలను విద్యార్థులు అవగతం చేసుకోవాలని కోరారు. నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌ఛార్జి ఎన్.వెంకటేష్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇసుక చౌర్యానికి పాల్పడితే చర్యలు

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గార మండలం సతివాడలోని ట్రాన్స్‌వరల్డ్ గార్నెట్ పరిశ్రమను మైనింగ్, విజిలెన్స్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం సందర్శించారు. ఏడేళ్లుగా మూతపడిన పరిశ్రమలో నిల్వ ఉన్న ముడి సరుకు ఇల్మెనైట్, రుటైల్ ఇసుక చోరికి గురవుతున్న నేపథ్యంలో ఆయా నిల్వలను పరిశీలించారు. సముద్ర తీరం నుంచి కూడా పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నట్టు సమాచారం మేరకు ఆయా ప్రాంతాలను పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో సహజ వనరులు భారీగా దోచుకున్నారని ఆరోపించారు. ఏడేళ్లుగా మూతపడిన గార్నెట్ పరిశ్రమలో ఇసుక, ముడి సరుకులు దొంగతనానికి గురైందన్నారు. ఈయన వెంట మైనింగ్ శాఖ డిడి, విజిలెన్స్ ఆర్ఐ, టిడిపి నాయకులు ఉన్నారు.

సకాలంలో రైతులకు సాగునీరు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వంశధార శివారు భూములకు సకాలంలో సాగునీరు అందించడమే టిడిపి ధ్యేయమని ఆ పార్టీ మండల నాయకుడు దుంపల వల్లభరావు అన్నారు. వంశధార 60 ఆర్ఎల్ కాలువ నుంచి నారాయణపురం పులి చెరువుకు సాగునీరు అందించే 5 ఎఎల్ కాలువ పూడికతీత పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి చేనుకు నీరు, ప్రతి చేతికి పని నినాదంతో ఎన్నికలకు వెళ్లి గౌతు శిరీష ఎమ్మెల్యేగా గెలుపొందారని అన్నారు. ఈ హామీ మేరకు ఈ ప్రాంతానికి వంశధార నీరు తీసుకుని రావడానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఖరీఫ్‌కు సకాలంలో జులైలోనే సాగునీరు అందడం ఇదే మొదటి సారని గుర్తు చేశారు. రైతు సమస్యలపై చిత్తశుద్ధి ఉన్నది ఒక్క టిడిపికి మాత్రమే ఉందని అన్నారు. కార్యక్రమంలో



పనులను ప్రారంభిస్తున్న వల్లభరావు

మాజీ సర్పంచ్ చింతాడ సత్యనారాయణ, తిరుపతిరావు బాబూరావు, చింత నూకయ్య, ఎల్. పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న వరప్రసాద్

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- కవిటి

కవిటి బెహరా వీధిలో పునర్నిర్మిస్తున్న జగన్నాథ స్వామి ఆలయం, బీచ్ రోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి దాతల సహకారం ఎంతో అవసరమని విశ్రాంత డిఎస్‌పి, జగతికి చెందిన శమల్ల వరప్రసాద్ అన్నారు. జగన్నాథ స్వామి దేవాలయం పునర్నిర్మాణానికి తనవంతుగా ఆయన రూ.25 వేలు మంగళవారం అందించారు. మదనాపురానికి చెందిన మార్పు వెంకటేశం రూ.పది వేలు అందించారు. జగతికి చెందిన లమ్మత శేషశైనం రూ.25 వేలు. రాజపురం సర్పంచ్ సనపల జానకిరావు 20 బస్తాల సిమెంట్ అందించారు. కార్యక్రమంలో మొగిలిపురి సీతాలు, పాండవ చంద్రశేఖర్, తిరుపతి బెహరా, పాపయ్యరెడ్డి, టి.ప్రేమానందం పాల్గొన్నారు.

యోగా కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

యోగా అండ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట విభాగం ఆధ్వర్యాన ఏడాది పాటు యోగా పీజీ డిప్లొమో కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ 31 వరకు పొడిగించినట్లు బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అదనపు రుసుం లేకుండా దరఖాస్తులను వర్సిటీ స్వీకరిస్తుందని తెలియజేశారు. డిగ్రీ ఉత్తీర్ణత సాధించి వారు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులని అన్నారు. ఈ కోర్సు ఫీజు రూ.పది వేలు కాగా, వర్సిటీలో ఇతర కోర్సులు చదువుచున్న విద్యార్థులకు 30 శాతం, బోధన, బోధనేతర సిబ్బందికి 50 శాతం ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. వర్సిటీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పొంది, దీనికి రిజిస్ట్రార్ పేరిట తీసిన రూ.200 ఆన్‌లైన్ ఫీజు రసీదును జతచేసి వర్సిటీ యోగా విభాగానికి అందజేయాలన్నారు.

లాబాంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని లాబాంలో గుత్తావల్లి ప్రాథమిక ఆరోగ్యం వైద్య సిబ్బంది మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి రమ్యశ్రీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. అందుకు ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరంతోపాటు ఇతర లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై ఆరా తీస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ మురళి, సూపర్‌వైజర్ పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సామాజిక విప్లవాన్ని తీసుకురావాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి



మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి- పలాస

దేశంలో సామాజిక విప్లవాన్ని తీసుకురావాలని, అది కమ్యూనిస్టు పార్టీలకే సాధ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జె.వి.సత్యన్నారాయణమూర్తి (నాని) అన్నారు. కాశీబుగ్గ టికెఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం జిల్లా సిపిఐ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిస్టు పారీలు సామాజిక ఉద్యమం ద్వారా అసమానతలను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుల కె.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు చాపర సుందరలాల్, సనపల నర్సింహులు, ఎం.యుగంధర్ పాల్గొన్నారు.

ఉప్పొంగేలా యువ తరంగాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని రాగోలు జెమ్స్ ఆధ్వర్యాన బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో మంగళవారం ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లినేని మెడీస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్థ ప్రస్థానాన్ని వివరించారు. గ్రామీణ, పట్టణ, పేద యువత జీవితాల్లో స్థిరపడేలా తాము చేస్తున్న కృషి, కార్పొరేట్ సంస్థలు అండగా నిలవడం సంతోషదాయకమని అన్నారు. ఇదంతా తమ సంస్థల చైర్మన్ భాస్కరావుతో సాధ్యమని అందన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణ, రాగోలు రోడ్డుకి ఇరువైపులా వంద మొక్కలు నాటారు. కార్యక్రమంలో బిఎస్‌సి పారామెడికల్ విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న నాగేశ్వరరావు

రామిగెడ్డ పూడికతీత పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం గ్రామీణ మండలం శివారు సాగు భూములకు నీరందించాల్సిన రామిగెడ్డ గుర్రపుడెక్క, పూడికతీత పనులను నగరంలోని విశాఖ-ఎ కాలనీ వద్ద ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్‌లో దిగువ ఆయకట్టు దారులకు సాగునీరందించడమే లక్ష్యంగా ఈ పనులు మొదలు పెట్టామని, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ కాలువ మరమ్మతులకు పనులకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ కాలువ పనులు పూర్తయితే దిగువన ఉన్న ఖాజీపేట, కిల్లిపాలెం, కొత్తపేట, అరసవల్లి రైతాంగానికి పూర్తిస్థాయిలో సాగునీరందుతుందని తెలిపారు. పనులు శరవేగవంతం చేసి శివారు భూములకు సకాలంలో నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

టిడిపి నాయకునికి సన్మానం

ప్రజాశక్తి- పలాస

టిడిపి కూటమి ప్రజారంజక పాలనకు శ్రీకారం చుడుతూ మహిళాభ్యుదయానికి పెద్దపీట వేస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 18వ వార్డులోని టిడిపి నేత పైల చక్రధరరావును 40 స్వయంశక్తి సంఘాల సభ్యులు మంగళవారం సత్కరించారు. తాజాగా మహిళలకు సిఎం చంద్రబాబు మరో వరం ప్రకటించారని, వడ్డీ లేకుండా రూ.10 లక్షల రుణాన్ని మంజూరు చేయనున్న అంశాన్ని ప్రస్తావించారు. ఆర్థికంగా పరిపుష్టి సాధించేందుకు మహిళలకు ఈ రుణ సదుపాయం ఎంతగానో ఉపయోగపడుతుందని చక్రధర్ అన్నారు. అలాగే ఎమ్మెల్యే గౌతు శిరీషమ్మ మహిళల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారానికి చొరవ చూపుతారని కొనియాడారు. అలాగే వార్డులోని పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై చక్రధర్ వద్ద ప్రస్తావించగా, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో వార్డు కార్యదర్శి గుంట ధర్మారావు, ఆర్.పి.హేమలత పాల్గొన్నారు.



చక్రధర్‌ను సన్మానిస్తున్న మహిళలు

పాత పెన్షన్‌ను అమలు చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

2003 ఉపాధ్యాయ, ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం మెమో నంబరు 7 ప్రాప్తికి పాతపెన్సన్ (ఒపిఎస్) అమలు చేయాలని కోరారు. ఈ మేరకు డిఎస్‌సి 2003 ఫోరం తరుపున ఉపాధ్యాయులు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ... ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎం.సురేష్, కె.శ్రీధర్, డి.రామారావు, బూటు వైకుంఠరావు, జి.చిన్నకృష్ణ, బి.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి అండ

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని మాణిక్యపురానికి చెందిన కిడ్నీ బాధితుడు దిలీప్ దొలైకు స్థానిక ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. దిలీప్ ఐదేళ్లుగా వాలంటీరుగా పనిచేస్తూ పార్ట్ టైం డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహించేవాడు. ఇటీవల అనారోగ్యానికి గురై వైద్య పరీక్షలు నిర్వహించగా రెండు కిడ్నీలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. దీంతో దిలీప్ తల్లి కిడ్నీ దానానికి ముందుకు వచ్చినా వైద్యులు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో దిలీప్ కుటుంబ సభ్యులు దాతల సహాయం కోరారు. విషయం తెలుసుకున్న ఎస్‌జిఎఫ్ సంస్థ సభ్యులు మంగళవారం గ్రామానికి చేరుకుని తమ వంతుగా రూ.8 వేలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని దిలీప్ కుటుంబాన్ని దాతలు ఉదాహరణగా ఆదుకోవాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నాగావళి నది తీర ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని కొత్తవలస-నిమ్మతొర్లాడ గ్రామాల మధ్య నాగావళి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందించిన అన్నారు. సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించగా రెండు ట్రాక్టర్లు ఇసుకతో పట్టుబడినట్లు చెప్పారు. ఎటువంటి పత్రాలు లేకుండా అనధికారంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఢిల్లీరావు జన్మదిన వేడుకలు

ఇచ్ఛాపురం : మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు జన్మదిన వేడుకలను మంగళవారం టిడిపి నాయకులు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల జయదేవ్, సాలీనా ఢిల్లీ, దక్కత శ్రీను, ఎల్.పద్మనాభం, కామేశ్వరరావు, కాళ్ల గోపి, ఢిల్లి, పెద్దిన బాబ్జీ, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న ఢిల్లీరావు